క్లుప్తంగా

72.4 మి.మీ వర్షపాతం నమోదు



ప్రవహిస్తున్న నిగ్గిడి వంక

తలుపుల: మండలంలో శనివారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. వివిధ గ్రామాల్లో వంకలు పారాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. 72.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత మూడు నెలలుగా సరైన వర్షం లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఉపశమనం లభించింది. చెరువులు, కుంటల్లోకి నీరు రావడంతో నీటి కొరత ఉండదని చెబుతున్నారు. వేరుశనగ, వరి, తదితర పంటలు కళకళలాడుతున్నాయి.

పోతలయ్య స్వామికి పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పోతలయ్య, చెన్నేకేశవస్వామిని దర్శించుకున్నారు.

29న శతరుద్రాభిషేక హోమం



హోమం నిర్వహణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

అమడగూరు: ఓడీచెరువు మండలం చింతమానుపల్లి గ్రామంలోని బొమ్మిరెడ్డిచెరువు వద్ద ఈనెల 29వ తేదీన శతరుద్రాభిషేక, చండీహోమాలు నిర్వహించనున్నట్లు శ్రీ విద్యాసద్గురు సేవా ట్రస్టు సభ్యులు శరత్‌కుమార్‌రెడ్డి, బొట్టు స్వామి తెలిపారు. ఆదివారం విద్యానృసింహ భారతి స్వామితో కలసి ట్రస్టు సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. లోక కల్యాణార్థం, సర్వజన యోగ, క్షేమ, ఆరోగ్య, వ్యవసాయ సస్యాభివృద్ధి కోసం హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరమేశ్వరుడి అనుగ్రహం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు గంగాధర్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి



ప్రశాంత్ (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రశాంత్ (32) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు.. ప్రశాంత్ మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి గుండెలో కొద్దిగా నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు చెప్పారు. ఉదయం నొప్పి ఎక్కువ కావడంతో చికిత్స నిమిత్తం పుట్టపర్తిలోని సాయిబాబా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య, 7 ఏళ్ల కుమారుడు ఉన్నారు.

నివాళి..

మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో ప్రశాంత్ మృతదేహాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, పట్నం సర్పంచ్ చలపతినాయక్, ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను కాపాడుకుందాం

అనంతపురం సిటీ: ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్)ను ఐక్యంగా కలసి కాపాడుకుందామని ఆ సంస్థ క్యాజువల్ కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మిక ఫెడరేషన్ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ సమావేశ మందిరంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కరీం అధ్యక్షతన ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పుట్టపర్తిలో జియో ఫైబర్ సేవలు



జియో ఫైబర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలో జియో ఫైబర్ నెట్ సేవలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆదివారం ప్రారంభించారు. జియో ఫైబర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 550 పైచిలుకు టీవీ చానల్స్, 16 ఓటీటీ యాప్స్, ఉచిత వీడియో గేమ్స్, ల్యాండ్ ఫోన్ కనెక్షన్, అపరిమిత వైఫై ఇంటర్‌నెట్ సదుపాయం కలిగిన జియో ఫైబర్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జియో ఫైబర్ ఫ్రాంచైజీ పార్టనర్ సతీష్ నాయక్, మార్కెటింగ్ హెడ్ రామకృష్ణను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, కౌన్సిలర్లు సాయిగీత, రాంలక్ష్మణ్, వేదనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరో 30 ఏళ్లపాటు కొనసాగేలా ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మలమీదపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. తొలుత గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ, మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. గజమాల వేసి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ కళావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎక్కడా అవినీతికి తావు లేకుండా అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారని తెలిపారు. అదే టీడీపీ పాలనలో ఐదు సంవత్సరాల పాటు దోచుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిన చంద్రబాబు జైలు పాలయ్యారని తెలిపారు. తండ్రి జైలులో ఉంటే కుమారుడు లోకేష్ రాష్ట్రం వదిలిపెట్టి వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం దోపిడీని మార్గంగా ఎంచుకున్నారన్నారు. ఎక్కడా చట్టానికి దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్న చంద్రబాబు ఇన్ని రోజులకు అడ్డంగా దొరికి జైలు పాలైన పరిస్థితి మనం కళ్లారా చూస్తున్నామన్నారు.

14 ఏళ్లలో చంద్రబాబు చేసింది శూన్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని చెబుతున్న టీడీపీ కాని వారి తోక పార్టీలు చెబుతున్న మాటలు నమ్మొద్దన్నారు. 14 సంవత్సరాల్లో చంద్రబాబు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. అధికారంలో ఉండగా టీడీపీ ఏం చేసిందో.. వైఎస్సార్‌సీపీ ఏం చేసిందో ప్రజలు గమనించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రోడ్లు వేయించామన్నారు. ప్రతి గ్రామంలో కోట్ల రుపాయలతో సచివాలయ భవనాలు, నాడు–నేడులో భాగంగా పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ఇవన్నీ కూడా అభివృద్ధి కార్యక్రమాలు కాదా అంటూ ప్రశ్నించారు. అన్నింటి కంటే మన మండలానికి తాగు, సాగు నీరు లేని పరిస్థితి ఉండేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ఆశీస్సులతో కరువును పారదోలేందుకు హంద్రీనీవా జలాలను మండలానికి తీసుకొచ్చామన్నారు. ఏడాది కాలంలో మండలంలోని ప్రతి చెరువుకు హంద్రీనీవా జలాలను ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మంచి జరిగితేనే మమ్మల్ని ఆదరించండి అంటూ చెప్పగలిగిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీకి గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారని.. రాబోయే ఎన్నికల్లో సైతం బుద్ధి చెప్తారన్నారు. అనంతరం గ్రామ సచివాలయ భవనాన్ని నాణ్యతగా నిర్మించిన కాంట్రాక్టర్ వెంకటశివారెడ్డిని అభినందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

స్థానిక మైనార్టీ నాయకుడు అమానుల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డిని ముస్లిం సంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాపరెడ్డి, చలపతి, ముబారక్, అల్లాబకాష్, గోపాల్‌రెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, సర్పంచులు రహంతుల్లా, బుక్యా రవీంద్రనాయక్, శాంతమ్మ, ఉత్తన్న, హుస్సేన్‌పీరా, హరిప్రసాద్‌రెడ్డి, విశ్రాంత వీఆర్వో రామచంద్రారెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



అగిశం జయలక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండలంలోని నల్లసింగయ్యగారిపల్లికి చెందిన మాజీ మంత్రి అగిశం వీరప్ప సతీమణి అగిశం జయలక్ష్మి (65) అనారోగ్యంతో శనివారం రాత్రి అనంతపురంలో మృతి చెందింది. ఆదివారం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జయలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు డాక్టర్ అగిశం రంగనాథ్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: మండలంలోని చెరువుముందరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పిరెడ్డి కుమారుడు శశికుమార్‌రెడ్డి (26) శనివారం బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళి అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శేషూరెడ్డి, బత్రాజుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ రాజు, నాయకులు వెంకటరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శంకర, నారాయణ స్వామి, రవీంద్రరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జూనియర్ లైన్‌మెన్ అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న ఏఈ కొండారెడ్డి

ధర్మవరం అర్బన్: ఆల్ ఇండియా ఎలక్ట్రికల్స్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు నిర్వహించే బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి ధర్మవరం పట్టణానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ అనిల్‌కుమార్ ఎంపికైనట్లు డీ2 ఏఈ కొండారెడ్డి తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆదివారం జూనియర్ లైన్‌మెన్ అనిల్‌కుమార్‌ను ఏఈలు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖలో పని చేస్తున్న క్రీడాకారులకు నిర్వహించే పోటీలు అక్టోబర్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ వరంగల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో కూడా అనిల్‌కుమార్ రాణించాలని ఆకాంక్షించారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: అరుణాచలం గిరిప్రదక్షిణకు కదిరి డిపో నుంచి ఈనెల 28న ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 28న మధ్యాహ్నం 12 గంటలకు సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు బయలుదేరుతాయన్నారు. భక్తులు ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు టికెట్ రూ.1270, ఎక్స్‌ప్రెస్ సర్వీసులో రూ.900 వసూలు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9052537054 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ ఆయా (హెల్పర్) పోస్టులకు అర్హులు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కవితాదేవి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మొత్తం 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రామగిరి మండలంలో గంగంపల్లి (ఎస్సీ), పోలేపల్లి-1 (ఓసీ) పోలేపల్లి-2 (బీసీ-ఈ), రామగిరి-2 (బీసీ-బీ) చెన్నేకొత్తపల్లి-1 (ఓసీ)గా రిజర్వేషన్లు ఖరారు చేశారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా కార్యవర్గం ఎన్నికను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సత్యసాయి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

రామాంజనేయులుకు నివాళి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు

ధర్మవరం: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం రాష్ట్ర నాయకులు ఓబులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, జింకా చలపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ హాజరయ్యారు. పోలా రామంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: మండలంలోని వేములపాడు రహదారిపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రి మండలం గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పెన్నానది నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకున్నామన్నారు. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'మానవత'కు బాడీ ఫ్రీజర్ వితరణ



మానవత సంస్థ సభ్యులకు బాడీ ఫ్రీజర్ అందిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: 'మానవత' స్వచ్ఛంద సేవా సంస్థకు మండల కేంద్రానికి చెందిన దండే రవి రూ.71,000 విలువ చేసే బాడీ ఫ్రీజర్ అందజేశారు. స్థానిక శివాలయం వద్ద ఆదివారం సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి సమక్షంలో సంస్థ సభ్యులకు బాడీ ఫ్రీజర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద సమయాల్లో మానవత సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. తన తండ్రి జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ అందజేసినట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడమే లక్ష్యంగా ఏర్పాటైన మానవత స్వచ్ఛంద సంస్థకు భాగస్వాములుగా ఉంటూ తోడ్పాటు అందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో దండేరవిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ మండల ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, సభ్యులు గంగిరెడ్డి, రెడ్డప్ప, శ్రీరాములు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

ధర్మవరం: పట్టణంలో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఒక రోడ్డులో వినాయక విగ్రహాలు తరలివెళ్లేలా వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్తు నిర్వహించారు. దగ్గరుండి నిమజ్జన వేడుకలను పర్యవేక్షించారు. వినాయక నిమజ్జనానికి చెరువులోకి అనుమతి ఇవ్వకుండా కుణుతూరు, రేగాటిపల్లి, సంఘమేశ్వరం, గొట్లూరు ఇలా ఐదు స్పాట్‌ల వంకలను కేటాయించారు. అక్కడా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

మినరల్ వాటర్ ట్యాంకర్ బోల్తా



గాయపడిన రమణయ్య



బోల్తా పడిన మినరల్ వాటర్ ట్యాంకర్

ఎన్‌పీకుంట: మినరల్ వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బండ్లపల్లి రమణయ్య తన మినరల్ వాటర్ ట్యాంకర్‌తో వెలిగల్లు నుంచి తిరిగి వస్తున్న సమయంలో మండల కేంద్రానికి సమీపంలోని లోతొంక వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో అన్నమయ్య జిల్లా రాయచోటికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు.

నేడు 'స్పందన'

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలకు ఆధార్‌కార్డు నకళ్లను జత చేయాలని తెలిపారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కేశవరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన కేశవరెడ్డి తొండపాడు గ్రామంలో తమ బంధువుల వివాహానికి వచ్చాడు. కల్యాణమండపం వద్దకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కేశవరెడ్డి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో పోస్టాఫీసు వద్ద నిచ్చెనపైకి ఎక్కి డిష్ వైర్ రిపేరి చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. చంద్రబాబు విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి పైకి ఎక్కి డిష్ వైర్ రిపేరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటోలో నుంచి జారి పడి..

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఆదివారం ఆటోలో నుంచి ధనుంజయ అనే వ్యక్తి జారి కింద పడి గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే తుగ్గలి గ్రామానికి చెందిన ఆటో గుత్తి నుంచి తుగ్గలికి వెళుతున్న సమయంలో వెనుక వైపు కూర్చున్న ధనుంజయ ఆటో కుదుపునకు గురి కావడంతో జారి కింద పడి గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడిన హేమావతి



అలంకరణలో స్వామి

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

కనగానపల్లి: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ నెలాఖరులోపు ఈ క్రాప్ నమోదు చేయించకోవాలని ఏఓ కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈ- క్రాప్ నమోదు వేగంగా సాగుతోందన్నారు. ఇప్పటి వరకు సుమారు 75 శాతం మంది రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈ నెల 30 తేదీ లోపు పంటల వివరాలను నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు, పంట నష్టపరిహారం అందుతుందన్నారు.

ఐదు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

పుట్టపర్తి టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుట్టపర్తి మున్సిపాలిటీలో ఐదు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి బ్రాహ్మణపల్లి ఫీడర్‌కు పరిధిలో ఉన్న బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, బడే నాయక్ తండా, గోనేనాయక్ తండా గ్రామాలకు పూర్తిగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న గ్రామాలకు రెండు రోజుల పాటు విద్యుత్ పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పక్కీరప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని నీలవాండ్లపల్లి గ్రామంలో ఈనెల 21వ తేదీన గొర్రెల మంద వద్ద నిద్రిస్తున్న గొర్రెల కాపరులు పక్కీరప్ప, గోవిందమ్మ, దంపతులు దుండగులు దాడిలో గాయపడిన విషయం తెలిసిందే. వీరు కదిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, నాయకులు నాగభూషణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆహారం నాణ్యతగా ఉండాలి

ధర్మవరం రూరల్: ఫుడ్ సేఫ్టీ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటల్స్ నిర్వాహకులతో ఫుడ్ సేఫ్టీ, సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్ఎస్ఎఐ సర్టిఫైడ్ ట్రైనర్ యశోద దేవి ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆహారం వండే ప్రదేశాల్లో శుభ్రత పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర మాట్లాడుతూ.. ఆహార నాణ్యత పాటిస్తూ ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలను ముందుగానే తీసుకోవాలన్నారు. అందుకే సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలన్నారు. కార్యక్రమంలో వివిధ వ్యాపారస్తుల నిర్వాహకులు, పాన్ ఇండియా శిక్షణా నిర్వాహకులు సింధు, మోహన్‌బాబు, జిల్లా కో–ఆర్డినేటర్ బాబయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మణిశంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాక్ ఫర్ హెల్త్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం నడిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో ఆదివారం ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకింగ్ క్లబ్ సంస్థ చేపట్టిన వాక్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నడక ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఉదయం, సాయంత్రం నడవడం అలవర్చుకోవాలని సూచించారు. క్రీడా మైదానం నుంచి పోతుకుంట దగ్గరున్న ప్రియదర్శిని పాఠశాల వరకూ వెళ్లి తిరిగి క్రీడా మైదానం వరకూ దాదాపు 5 కిలోమీటర్ల నడకను కొనసాగించారు. కార్యక్రమంలో ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకింగ్ క్లబ్ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి జబివుల్లా, సహాయ కార్యదర్శి ఇనాయత్‌బాషా, కోశాధికారి ఓంప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుజిత్ కిషోర్, సురేష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి పూజలు



అలంకరణలో పెద్దమ్మ దేవత

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ దేవత కొల్లాపురి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వివిధ పూజలను నిర్వహించారు. సాయంకాలం శాంతి, వాస్తు, గణ హోమాలను అర్చకులు నిర్వహించారు.